# ౩౦. తీరిన సమస్య

అంతకుపూర్వమే తన కా విషయం చూచాయగా తెలుసుకాని తనకు తెలియనట్టుగానే నటించటంవల్ల ఎంతో సుఖంవుందని సుబ్బయ్యకు తెలియకపోలేదు. దంపతుల మధ్య వున్న ఆ సౌకుమార్యం చెడకుండటమే గాక ఇదివరకువలెనే భార్య చాటుగా మాటుగా చీకటితప్పు చేయటం వల్ల తానంటే ఒక విధమైన భయభక్తులు నిరూపించటంగానే తను భావించ వలసి వుంటుంది. ఎదుట నిలబడి నిలవదీసి అడిగే ధైర్యం తనకు లేకపోగా దాన్ని ఇతరుల ఎదుట ప్రదర్శించటం మరింత బాధాకరమైన సమస్యను ఎదుర్కోవటమే అవుతుంది కనుకనే తెలివిగల సుబ్బయ్య టోకు వ్యవహారంగా యీ ఎత్తు వేశాడు.

సుబ్బయ్య తెలివిగలవాడు కాదనే ధైర్యం ఎవ్వరికీ లేదు. పైకి కనిపించక పోయినా అతని బుఱ్ఱలో తీవ్రంగా అనేక ఆలోచనలు చిలవలు పలవలుగా తిరుగుతూనే ఉంటవి. తన భార్య తనకొక సమస్యగానే వుంది; ఐనప్పటికీ దాని జోలికి వెళ్ళి అపజయాన్ని వరించటంకన్న జోలికే పోకుండా గంభీరంగా ఉండటంవల్ల తన అశక్తత బైటపడదనే తెలివైన ఆలోచన సుబ్బయ్య బుఱ్ఱలో మెరిసింది.

అంతేగాక తాను కెలకటం ఆరంభిస్తే ఇదివరకు తెలియని వారిక్కూడా తెలియజెప్పుకోవటమే అవుతుంది. తెరవెనుక జరిగే వ్యవహారాలు బాహాటంగా జరిగినయ్యా తనసలు తలెత్తుకొని తిరగలేడు. కనుక యీ కుటుంబగౌరవాన్ని తానీవిధంగా తేలిగ్గా తెలివిగా రక్షించగలిగాడు.

భార్యను నిలదీయకపొయ్యేందుకు మరికొన్ని ఇతర కారణాలు లేకపోలేదు. ఆమె అంటే తనకెంతో గౌరవం. తనకన్న తెలివిగల వాళ్ళను గొప్పవాళ్ళుగా గౌరవించనంత మూర్ఖుడుకాదు సుబ్బయ్య. పోతే తన అసమర్థతవల్లనే ఆమె యీ చిరుతిండ్లకు అలవాటైందనే సంగతి కూడా తనకు తెలుసు. తన యీ లోపాన్ని ఒకవిధంగా ఆమె క్షమించిందనే చెప్పాలి. అదంతా ఒక వాగ్వాదం ద్వారా కాని కనీసం ఒకరినొకరు అర్థం చేసుకోవటంవల్లకాని జరిగిందని కాదు. ఎవరి మనసుల్లో వారే యీ సమస్యను పరిష్కరించుకొన్నారు. అలాగే గుట్టుగా సాగిపోతోంది. అన్నిటినీ మించి వంశగౌరవం మంటగలిపి లేచిపోయిన వాళ్ళకన్న తన భార్య వంశగౌరవానికి ఎలాటి భంగము రాకుండానే తన పురుషత్వాన్ని బజారు పాలు చేయకుండా దాంపత్యజీవితాన్ని గడపగలిగినందుకే సుబ్బయ్యకు ఆమె అంటే అంత గౌరవం.

మనం ఇంకా దూరం ఆలోచిస్తే ఇలాటి అవస్థలు వున్న భర్తల్లో సుబ్బయ్య ఒక్కడే కాదు. ఆ సంగతి సుబ్బయ్యకు మాత్రం తెలియకపోతేగా? ఇందులో నిజమైన బాధ ఏమిటంటే, భార్య మంగళసూత్రం వెనుక ఆడే నాటకం కాదు. ఆ సంగతి ఇతరులకు తెలిసిందే అని. దీన్నే వేరొక రూపంలో చూస్తే ఇతరులకు తెలిసినా తెలియనట్టే నటించినంత కాలమూ ఇతర భర్తల వలెనే ఆ భర్తా తన భర్తృత్వానికి గర్వపడకపోడు!

కనుకనే కామాక్షి ఆటలు మూడు సంవత్సరాలుగా సాగినవి. కాని ఒక పెద్ద అవాంతరం వొచ్చిపడింది. కామాక్షి తెలివితక్కువది కావటం వల్ల యీ ఇబ్బందికి గురైందని చెప్పలేము. కాని దైవికంగానే ఇదొక కొత్త సమస్యగా తయారైందని చెప్పవలసి వుంటుంది.

ఎంతో ఆలోచన మీదనే ఆమె సత్యాన్ని ప్రియుడిగా ఎన్నుకుందని చెప్పాలి. సత్యం అందగాడని కాదుకాని ఇరుగు పొరుగుల్లో యీ స్నేహాన్ని ఇతరులు అపార్థం చేసుకోకుండా వ్యవహారం గుట్టుగా సాగిపోవటమే గాక, తన వెంటబడ్డ ఇతరులకు కూడా మరో తరుణమంటూ లేకపోవటం వల్ల వీధి వీధంతా శాంతితో నిండివుంటుందన్న ఆమె వూహలో పొరపాటేమీ లేదు. కామాక్షి ఇచ్చిన యీ సదవకాశాన్ని దుర్వినియోగంచేసేటంత నీచుడు కాదు సత్యం. అందుకనే వారి మైత్రి రెండున్నర సంవత్సరాల వరకూ నిరాటంకంగా సాగింది.

ఇక్కడే ఒక పెద్ద ఇబ్బంది వొచ్చిపడింది. ఆ పక్క ఇంట్లో నారాయణ మొదటినుంచీ కామాక్షి వ్యవహారాన్ని పసిగడుతూనే వున్నాడు. తనకు సంబంధం వున్న వ్యక్తి అని కాదుకాని, కామాక్షిలాటి నవయవ్వనవతి చలింపచేసే పురుష హృదయపు బాధతోనే నారాయణ ఆమె వెంటబడ్డాడు. ఆమె తెలివైనది కావటంవల్లా కుటుంబ గౌరవపు విలువంటే ఏమిటో తెలిసిన వ్యక్తి కావటం వల్లా నారాయణకు సందు దొరకటం

లేదు. ఐనప్పటికీ నారాయణ పట్టుదలగల మనిషి కావటం వల్ల ఎన్ని విధానాల్లో తన ఆశయం సాధించాలో అన్నిటినీ ఉపయోగిస్తూనే వొచ్చాడు.

నిజానికి సత్యానికీ తనకూ విరోధం రావలసిన కారణం బొత్తిగా లేదు. కామాక్షిని తనకు అందకుండా చేశాడనే యీర్ష్య నారాయణలో యీ రూపాన్ని పొందింది. అందుకనే నారాయణ సత్యంమీద కాలుదువ్వటంలో శ్రద్ధ వహించాడు. అది కూడా అంతగా ఫలించలేదనే చెప్పాలి.

ఇంకా ఎంతో ఓర్పుతోనే నారాయణ రెండో కొన నుంచి తన ప్రయత్నాలు సాగించాడు. కామాక్షికి అతను రాసిన ఉత్తరాల వల్ల పోస్టు వాళ్ళకేమీ లాభం లేకపోయినా అవి తూకానికి అమ్మినా నాలుగైదు రూపాయిలైనా వొచ్చేవి. కాని ఒక్క ఉత్తరం కూడా కామాక్షి తప్ప వేరెవ్వరూ చూసే అవకాశమే లేకుండా పోయింది. అన్ని ఉత్తరాలకూ కామాక్షి మెదలకుండా వూరుకున్నదంటే ఆమె నీతి నియమాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

క్రమంగా నారాయణ ఓర్పు నశిస్తోంది. కామాక్షిని గోలచేసి బెదిరించి అదుపులోనికి తెచ్చుకుందామా అని ఆలోచన చేశాడు. దీని వల్ల ఐతే ఆ వొడ్డు లేకుంటే యీ వొడ్డు తేలిపోతుంది. ఎదురు తన్నిందా జీవితాంతం వరకూ కామాక్షి తనకు దక్కకుండానే ఏడిపించుకొని తింటుంది.

ఓర్పు నశించటం వల్ల దూరం ఆలోచించకుండానే నారాయణ ఆమెను బెదిరించసాగాడు. నారాయణ విషయంలో ఆమె తీవ్రంగా ఆలోచించింది. ఏ విధంగా చూసినా నారాయణలాటి వ్యక్తికి చోటుపెట్టటం మెడకు ఉరిపోసుకోవటమే అవుతుంది. తనలాటి సంసారిని యీ విధంగా బెదిరించటం వల్ల ఆమెకు నారాయణ మీద వున్న కాస్తో కూస్తో సదభిప్రాయం మటుమాయమైంది. పైపెచ్చు నారాయణను తృణప్రాయంగా చూడకపోతే లాభంలేదని కూడా తేల్చుకుంది.

యీ విధంగానే వారి మధ్య విరోధాలు రగిలినవి. తనమీద కాలు దువ్వినప్పుడు సత్యం సహనాన్ని ప్రదర్శించాడు కాని ప్రాణసమానంగా చూసుకొనే కామాక్షి మీద కాలుదువ్వటాన్ని అతను సహించలేకపోయాడు. తనకు కామాక్షితో వున్న సంబంధం చూచాయగా వీధిలోని వాళ్ళకంతా ఇదివరకే తెలుసు; వారికి తెలుసని తనకూ, కామాక్షికీ కూడా తెలుసు. ఆ తెలిసింది ప్రమాదపు సరిహద్దు దాటలేదు. ఇక నారాయణ నిరాశతో ప్రచారం సాగించటం మొదలయ్యాక తెర మరుగు వ్యవహారమంతా బట్టబయలు కాజొచ్చింది.

సమాజం సంగతి కాస్సేపు మరచిపోయి సుబ్బయ్య విషయం చూద్దాం: గోడలు చెడటం మొదలయ్యాక సుబ్బయ్యకు వేడెక్కనారంభించింది. ఇంత వరకూ పట్టించుకోని

సుబ్బయ్య తన పురుషత్వమే ఆపదలో పడినట్లు దాన్ని కాపాడుకునేందుకుగాను కామాక్షి మీద దాడులు ప్రారంభించాడు. యీ దాడు లన్నిటినీ ఆమె భరిస్తూనే వుంది. ఆమె సత్యం సహాయం కోరక పోయినా సత్యం కూడా నిస్సహాయ స్థితిలోనే వున్నాడు. ఆరు నూరైనా చేసుకున్న భర్తకున్న అధికారం తనకు లేదు. అదీగాక తాను బైటపడటంవల్ల మరింత రసాభాస అవుతుంది.

ఇదే సమయంలో కామాక్షిలాటి అందగత్తె తమకు అందదని నిరాశ చేసుకున్న యువకలోకంలో ఆశాకిరణమైతే జొరబడలేదుకాని, వారి కసి తీర్చుకునే సదవకాశం లభించటంవల్లనే నారాయణ మనస్తత్వానికి సరితూగే మనస్తత్వంతోనే వాళ్ళు అతనితో చేతులు కలిపారు. ఇందువల్ల జరిగిందేమంటే కామాక్షి నారాయణకుకానీ అతని బృందంలో ఏ ఒక్కరికి కానీ చిక్కకపోగా సత్యానిక్కూడా క్రమంగా దూరం జరగాల్సిన అవస్థ వొచ్చి పడింది.

కామాక్షి మూలాన మూడు ముఖ్యమైన పార్టీలు ఏర్పడినవి. ఒకటి సత్యం; రెండు నారాయణ బృందం, మూడు ఆమె భర్త సుబ్బయ్య. తమాషా ఏమిటంటే యీ మూడు పార్టీలూ ఒకరికొకరు అడ్డమే! ఏ రెండు పార్టీలూ కలియవు. యీ సమస్య ఎటుతిరిగినా పరిష్కరించబడే మార్గం చూపుమేర దూరంలో మాత్రం లేదు.

స్కూలు మాస్టర్ కావడం వల్ల సుబ్బయ్య జీవితం మరీ అధ్వాన్నమైంది. అందులోనూ వీధిలో బయలుదేరిన గోల రెండుమైళ్ళ దూరంలో వున్న నల్లబల్ల మీదికీ గోడలమీదికీ పాకేందుకు ఎంతోసేపు పట్టలేదు. తనంటే జనానికి ఇప్పటికే ఎగతాళయింది. ఏం చేసేట్టూ?

భార్యపట్ల తన దాడుల తీవ్రత హెచ్చించటం వల్ల కూడా జరిగేదేమిటో సుబ్బయ్య ఆలోచించకపోలేదు. లేచిపోయిన వాళ్ళ చరిత్రలు తిరగేస్తే పరిస్థితుల వొత్తిడి ఎంత గొప్ప కారణమో సుబ్బయ్యకు తెలుసు. ఇప్పటికి ఏర్పడ్డ వొత్తిడి గాక, కొత్తగా మరికొంత వొత్తిడిని ప్రవేశపెట్టటం వల్ల తిరిగి సరిజేసుకోలేని విధంగా వ్యవహారమంతా ఛిన్నాభిన్నమై పోతుంది.

ఒకేరకం వాతావరణంలో ఉండటంవల్ల మూడు పార్టీల్లోనూ సరిసమానంగా వేడి ఎక్కసాగింది. నీరు ఆవిరయే స్థితిలోకి పరిస్థితి దిగినప్పుడు, ఏం జరగాలో అదే జరిగింది. నారాయణా, సత్యం తలబడి కొట్టుకోవాల్సి వొచ్చింది. యీ కొట్టుకోవటం వేరొకచోట జరిగితే యీ కథకు పెద్ద అవాంతరం వొచ్చిపడేది. అది సరిగ్గా సుబ్బయ్య కొంపలో పట్టపగలు జరిగింది. దాంతో ఇంకేవిధమైన సందేహమూ లేకుండా కామాక్షి కారణంగానే వీరిద్దరూ కొట్టుకున్నారనేది ఒక్క ఆ వీధినే గాకుండా వూరు వూరంతా మోగిపోయింది. దినపత్రికలో పడనందుకు సుబ్బయ్య తన అదృష్టానికి సంతోషించకపోలేదు.

కాని కామాక్షి ఒక్క సత్యంతో గడిపినా ఇంత చెడ్డపేరు వొచ్చిపడింది. పతివ్రతల లిస్టులో తన పేరు లేనందుకు ఆమె ఎప్పుడూ విచారపడలేదు కాని, వ్యభిచారిణుల లిస్టులో తన పేరు ఇరికినందుకే ఆమె బాధపడింది. తనవల్లనే ఇంత రసాభాస జరిగింది; జరగకుండా తప్పించుకునే మార్గం వేరే లేకపోయింది.

సుబ్బయ్య తక్కువ బాధకు గురి కాలేదు. ఆ రాత్రంతా దంపతులు ఎవరి మంచాల మీద వారు పడుకొనే మాటా పలుకూ లేకుండా ఎవరి ఆలోచనలో వారున్నారు. తమాషా ఏమిటంటే ఇదివరకు చేసిన దాడుల చిహ్నాలు కూడా యీనాడు ఆ ఇంట్లో కనిపించటంలేదు, గాలివాన ఐ పొయ్యాక నిలబడే శాంతిలాటిది ఏర్పడింది.

ముళ్ళమీద ఆరవేసిన బట్టను తీయటంలో ఎంత జాగ్రత వహించాలో తెలిసిన ఆ దంపతులు త్వరపడలేదు. ఐనప్పటికీ ఐన దాన్ని గూర్చి బాధపడటం మాని, అవబొయ్యేదాన్ని గూర్చిన జాగ్రత విషయంలో ఆలోచనలు సాగించారు.

సత్యం, నారాయణల కిద్దరికీ దెబ్బలు తీవ్రంగానే తగిలినవి. హాస్పటల్‌కు జేర్చాక కాని వారి మైకం పూర్తిగా దిగలేదు. శక్తిలేదు కాని, అక్కడ మళ్ళీ తలపడేందుకు ఇద్దరూ సిద్ధంగానే వున్నారు.

కామాక్షి మనోవేదన వేరొక విధంగా లేదు. ఆమెను వ్యభిచారిణిగా ఇదివరకే చాటుగా చెప్పుకొని అసహ్యించుకొంటున్న వీధిలోని సంసారాలు యీ సంఘటన తరువాత చెప్పవా? తనకన్న చెడతిరిగినవాళ్ళున్నారు. ఐతే ఆ తిరిగేవాళ్ళకు తప్ప ఇతరులకు వారిగోల తెలియదు కనుక కామాక్షి పడ్డ అవస్థ వాళ్ళదాకా రాలేదు. కేవలం వ్యాపార రూపంలో నడుస్తున్న వ్యభిచార గృహాల సంగతి ఎవరికీ పట్టకపోయినా ఒక్క కామాక్షి లాటిది వీధిలోని మొగాళ్లనందర్నీ పాడుజేస్తుందనే నమ్మకం వీధిలోని అన్ని సంసారాల్లోనూ లోతుగా పాతుకుంది.

మర్నాడు ఉదయం పోలీస్ స్టేషన్ నుంచి కబురు రాగానే సుబ్బయ్యకు మృత్యువే ఎదురైనట్లు తోచింది. కామాక్షికి గాక తనకొక్కడికే యీ కబురు రావడం కాస్త గుడ్డిలో మెల్లగా కనిపించింది. గత రాత్రి సత్యం, నారాయణ ఇద్దరి దగ్గరా డయింగ్ డిక్లరేషన్లను మేజిస్ట్రేట్ తీసుకున్నాడు. ఆ డిక్లరేషన్స్ ఎలా వున్నవో తెలుసుకునేందుకు సుబ్బయ్యకు దమ్ములు లేకపోయినవి. ఒకవేళ వాళ్ళిద్దర్లో ఎవరైనా చచ్చారేమో? ఇద్దరూ చస్తే పీడా వొదిలి పోతుందని సంతోషించేవాడే కాని, ఒక ఖూనీ కేసులో ఇరుక్కోక తప్పదు కనుక, జీవితభీమా కంపెనీ కన్నా ఎక్కువ భక్తితోనే వారి ఆరోగ్యానికి తన విధిని లోలోనే ప్రార్థించుకున్నాడు.

ఇన్‌స్పెక్టర్ సవాలక్ష ప్రశ్నలు అడిగాడు. సుబ్బయ్య ఎంతో వినయంగా జవాబులిచ్చాడు; కాని అందులోని నిజాన్ని మాత్రం దాచెయ్యటంలో అతను తక్కువ

జాగ్రత్త వహించలేదు. ఎందుకంటే ఆ నిజం చెప్పటమంటే తన పరువు ప్రతిష్ఠల్ని విప్పి చెప్పటమే!

ఇలాటి విషయాల తాలూకు నిజాలు పోలీసులకు తెలియకపోదని ఇదివరకు సుబ్బయ్యకు తెలియదు. ఎందుకంటే జరిగింది వొకటైతే కోర్టుకు వెళ్ళేప్పటికి దాని రూపం మారటమనేది బాగా తెలిసిన సుబ్బయ్య అసలు వాళ్ళకు తెలిసిందే అంతని పొరపాటు పడ్డాడు.

సుబ్బయ్య డొంకతిరుగుడు వ్యవహారాలకు ఇనస్పెక్టర్ కోపాన్ని సూచించక తప్పలేదు.

"వాళ్ళిద్దరూ మీ ఇంట్లో కొట్టుకున్నారు...ఎందుకనీ? జవాబు సూటిగా చెప్పాలి సుమా!"

ఇనస్పెక్టర్‌కు అసలు విషయం తెలుసేమోననే అనుమానం సుబ్బయ్యకు ఇప్పుడే కలిగింది. కాని జవాబు చెప్పకుండానే సుబ్బయ్య తల వేళ్ళాడేశాడు. ఆ చుట్టుపక్కల ఎవ్వరూ లేకపోవటం కొంత నయం!

"వాళ్ళలో ఎవరైనా చస్తే నీ సంజాయిషీ ఏమిటి?"

"అప్పుడు నేను ఇంట్లో లేను."

"కాని అది నీ ఇల్లే అయినందుకు నీ జవాబుదారీకూడా ఉండాలి. సరే...నేను సాయింత్రం ఐదింటికి మీ ఇంటికివొచ్చి ఆ ప్రదేశమంతా చూస్తాను- నువ్వు వెళ్ళొచ్చు."

సుబ్బయ్యకు సింహం బోనులో నుంచి బైటపడ్డట్టే తోచింది. కాని ఆ సింహమే తన ఇంటికి వొస్తాననటం బాధ పెట్టకపోలేదు. యీ పరిస్థితుల పరిణామం ఎట్లా వుంటుందో సుబ్బయ్యకు అనూహ్యంగానే వుంది. ఆ జైలు బొచ్చెల్లో పప్పు, చారు, కూడు తినటం...తన ఉద్యోగానికి నీళ్ళధార మొదలైన దృశ్యాలు జ్ఞాపకంవొచ్చి అతన్ని కలవరపెట్టినవి.

ఇప్పుడు కామాక్షిమీద వుండే అసహ్యభావాన్ని పూర్తిగా తగ్గించుకున్నాడు. ఇద్దరూ కలిసి యీ గండాన్ని దాటేందుకు ఒక ప్లాను అవసరం. ఇద్దరి కథనంలోనూ తేడా వుండకూడదు. ఆమెతో మాట్లాడాడు; ఆమె కూడా యీ విషయంలో భర్తకు సహాయపడేందుకు తన అంగీకారాన్ని తెలియపరిచింది.

ఇన్‌స్పెక్టర్ ఏడింటికికాని రాలేదు. అసలు రాడేమోనని బతికి పొయ్యామనుకున్న సుబ్బయ్యకు యీ రాక చాలా బాధాకరంగానే వుంది.

ఇన్‌స్పెక్టర్ ఇల్లంతా కలయదిరిగాడు. వాళ్లుకొట్టుకున్న బాపతు రక్తపు మరకలు గోడల మీద స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నవి. కామాక్షిని కూడా కొన్ని ప్రశ్నలు వేశాడు.

ఆమె సరిగా జవాబులు చెప్పలేదు. తను ఒంటరిగా వున్నా నిజాన్ని బైటపెట్టకపోవటం ఇనస్పెక్టర్‌కు కష్టంగానే తోచింది.

"నా కంతా తెలుసు. నిన్ను చూడకపూర్వం నీ కోసం కొట్టుకున్నారంటేనే నీలో గొప్ప ఆకర్షణ వుండివుండాలనుకున్నాను. చూశాక నేను అనుకున్న దానికన్న ఎక్కువ ఆకర్షణగానే ఉన్నావని తేలిపోయింది."

"చిత్తం...చిత్తం!" అని సుబ్బయ్య నీళ్ళు నములుతూ అక్కణ్ణుంచి తప్పుకున్నాడు. తన సౌందర్యాన్ని ఆకాశ మెత్తుకు ఎత్తిన ఇన్‌స్పెక్టర్ మొహంలోకి కామాక్షి మొట్టమొదటిసారిగా గర్వంగా సూటిగా చూసింది.

"ఇంకో వారంలో వాళ్ళు బైటపడతారు. కాని యీ కేసు సంగతేమిటి?"

ఇన్‌స్పెక్టర్ కంఠస్వరంలోని లొంగుబాటుతో పాటు అతని మాటల్లోని మృదుత్వాన్ని గ్రహించకపొయ్యేందుకు కామాక్షి తెలివితక్కువది కాదు.

"మీరే చెప్పండి" అంది రాజీగా.

"చెప్పేందుకేముందీ? ఇద్దరికీ దెబ్బలు తగిలినవి గనుక ఇద్దరి తప్పూ వుంది. వారం రోజుల్లోనే ఆసుపత్రి నుంచి వొస్తారు కనుక అది పోలీస్ కేస్ కాదు...మరి యింకముందు యీ వీధిలో శాంతి వుంటుందనే నమ్మకం ఎలా?"

ఆమె మాట్లాడలేదు. కేసు వుండబోదని ఇన్‌స్పెక్టర్ చెప్పకపూర్వమే ఆమె వూహించింది. జరగబొయ్యేది కూడా ఆమె వూహించింది. కనుకనే తన వూహకు అనుగుణంగా ఇన్‌స్పెక్టర్ మాటాడటానికోసమే ఆమె ఎదురు చూస్తోంది.

"ఇక్కడ తగినంత హంగు లేకపోతే మీ సంసారం బజారు పాలౌతుంది. వీధిలో ఇద్దరు పోలీసువాళ్ళు అవసరమౌతారు. కనుక ఏదో ఉపాయంగా యీ వ్యవహారం తలెత్తకుండా తొక్కిపట్టాలి."

"సద్దుమణిగేదాకా మీరొక కంట కనిపెట్టి వుండకూడదా?" అంది ఆమె. ఇన్‌స్పెక్టర్ మొహం చేటంతయింది.

"ఏం చేయగలమంటారు?"

"మీలాటివారి అండవుందని తెలుస్తే వీళ్ళ ఆటలు సాగవు. అన్ని వ్యవహారాలూ దాంతో వాటంతటవే సర్దుకుంటవి."

ఇన్‌స్పెక్టర్ దీనికి ఒప్పుకున్నందుకు తార్కాణంగా ఆ రాత్రి అక్కడే నిద్దర చేశాడు.

తెలివైనవాళ్ళ ఆలోచనలు ఎప్పుడూ వృథా కావని యింకొకసారి రుజువైంది. సుబ్బయ్య ఇప్పుడు తిరిగి తలెత్తుకు తిరుగుతున్నాడు. అతని వొంటిమీద ఎవరూ యీగను వాలనియ్యటంలేదు. మరికొంతమంది పోలీస్ స్టేషన్‌లో పలుకుబడి

కావలసినవాళ్ళకు సుబ్బయ్య ప్రాపకం అవసరమై అతన్ని ఆకాశమెత్తున ఎత్తుతున్నారు. యీ విధమైన ప్రజాసేవలో సుబ్బయ్య గర్వంగా ఠీవిగా జీవితాన్ని గడుపుతున్నాడు. ఇదివరకులాటి దురభిప్రాయమేదీ సుబ్బయ్యపట్ల ఎవరికీ లేదు; వున్నా పైకి పొక్కటం లేదు.

ఇక కామాక్షి సంగతి వేరే చెప్పాలా? ఆమెను గూర్చి చాటుగానన్నా వీధిలోని ఆడవాళ్ళు చెడుగా చెప్పుకోవటంలేదు. తమ భర్తలు కామాక్షి జోలికి పోవటమంటే పోలీస్ స్టేషన్‌కు పోవటమే అవుతుందనే హెచ్చరికను తాము చేయవలసిన పని లేదు. వారంతట వారే కామాక్షి ఇంటి ఛాయలకు పోవటం మానుకున్నారు. సుఖంగా సంసారం చేసుకునే ఇల్లాళ్ళకు ఇంతకన్న రక్షణ ఏం కావాలి కనుక?

ఇన్‌స్పెక్టర్ని గూర్చి అనుకునే సాహసం మాత్రం ఎవరికుంది? ఆయన స్నేహరూపంలోనే వారింటికి వొచ్చిపోతున్నాడనే కథ మాత్రమే వెలుగులోకి వొచ్చింది.

గోడలు చెడటంలేదు. వీధిలో శాంతి భద్రతలు నెలకొల్పబడినవి. పోతే సత్యం, నారాయణ ఇదివరకు విరోధాలు మానుకొని స్నేహితులయ్యారు. తోకలు తెగిన నక్కలు ఎప్పుడూ వొక్కటేగా! యీ సమస్య ఇంత తేలిగ్గా సూక్ష్మంగా, హాయిగా పరిష్కరించబడుతుందని ఎవరనుకున్నారు?

– *ఆగష్టు, 1950*